క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ తిరునాల


గంగమ్మ తిరునాలలో బండలాగుతున్న ఎద్దు

పెండ్లిమర్రి : మండలంలోని పగడాలపల్లె గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మ అమ్మవారి తిరునాల బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకాలకరణ, అకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అవరణలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే చెక్కభజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు

గంగమ్మ అమ్మవారి తిరునాల ఉత్సవాల సందర్భంగా ఆలయ అవరణలో బుధవారం సాయంత్రం బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలకు ఎనిమిది జతల ఎద్లు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఇంజనీరింగ్ సెక్రటరీలపై ఉన్న సస్పెన్షన్ రద్దు

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఏడు మంది అమినిటీ సెక్రటరీలపై ఉన్న సస్పెన్షన్‌ను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 27వ తేదీన పబ్లిక్ హెల్త్ ఇంజనీరు ఎస్ఈ వారు అభియోగాలు ఉన్నందువల్ల సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే వారిపై ఉన్న అభియోగాలపై తాను ఇచ్చిన రిపోర్టు ఆధారంగా సస్పెన్షన్‌ను రద్దు చేసి తిరిగి వారిని విధులకు హాజరుకావాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు. అమినిటీ సెక్రటరీలందరూ విధులకు హాజరు కావాలని ఆయన సూచించారు.

నాలుగు ఈ-స్టాంపింగ్ కేంద్రాలు మంజూరు

కమలాపురం : కమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నాలుగు ఈ-స్టాంపింగ్ కేంద్రాలు మంజూరు అయినట్లు సబ్ రిజిస్ట్రార్ డీఎం బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణంలోని యాసీన్ ప్లాజా సమీపంలో షేక్ మహబూబ్‌వలి, పెద్ద చెప్పలి బైపాస్ రోడ్డు నందు పి.వెంకటరమణ, కమలాపురం ఆర్ఎస్ రోడ్డులోని శివకిషోర్ రెడ్డి, కమలాపురం స్టేట్ బ్యాంక్‌లకు ఈ సెంటర్లు మంజూరు అయ్యాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వీరు కూడా స్టాంపులు విక్రయిస్తారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పైడిపాలెం రిజర్వాయర్‌ను సందర్శించిన ఆర్డీఓ


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేశ్వర్లు

సింహాద్రిపురం : మండల పరిధిలోని పైడిపాలెం రిజర్వాయర్‌ను బుధవారం పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు మొదటిసారిగా సందర్శించారు. ఆర్డీఓ సింహాద్రిపురం ఆర్ఐ షేక్షా రిజర్వాయర్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అనంతరం భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

స్మశానానికి దారి ఏర్పాటు


సర్వే చేస్తున్న సర్వేయర్ సోమశేఖర్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్

చెన్నూరు : చెన్నూరు పెన్నానది పరిధిలోని స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేశామని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరు, బుడ్డాయిపల్లె, అరుంధతి నగర్, కొత్తగాంధీనగర్, సరస్వతినగర్, లక్ష్మీనగర్, శ్రీరామ్ నగర్‌లకు చెందిన ప్రజలకు స్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. చెన్నూరు పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి పక్కనుంచి పెన్నానదిలోకి వెళ్లేందుకు రహదారికి సంబంధించి మండల సర్వేయర్ చేత రోడ్డుకు సర్వే చేసి ఎస్టిమేషన్ వేయించామన్నారు. దీనికి సంబంధించిన పనులు వేగవంతంగా జరిగేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

భక్తులకు అన్నదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని మార్కెట్ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సీనియర్ పాత్రికేయుడు గుంట కృష్ణకుమార్ తండ్రి గుంట వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చంద్రగిరి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివస్తూ అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. అలాగే చంద్రగిరి గ్రామంలో వర్షాలు పడినప్పుడల్లా వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందని.. గ్రామంలో వంకకు సైడ్ కాలువతోపాటు చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ వంక చుట్టూ సైడ్ కాలువతోపాటు చెక్‌డ్యాంను నిర్మించే విధంగా పాడా నిధులను విడుదల చేస్తామన్నారు. గ్రామంలో ప్రతిరోజు రాత్రి సమయాల్లో 10గంటల నుంచి విద్యుత్ కోతలు విధిస్తున్నారని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ట్రాన్స్‌కో ఏడీ శ్రీకాంత్‌తో మాట్లాడి గ్రామంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. మాజీ సర్పంచ్ నీలకంఠారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్షల లబ్ధి చేకూరుతోందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధికి కేరాఫ్‌గా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తోందన్నారు.

దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీ వికలాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే ఒక్కో త్రిచక్ర వాహనాలను 14 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు మరో 100 నుంచి 150 త్రీవీలర్స్ కోసం అప్లికేషన్లు దరఖాస్తులు చేసుకున్నారని.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారికి కూడా త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా అలాగే వృద్ధులు, దివ్యాంగుల కోసం అలింకో 40 మెడికల్ క్యాంపులు నిర్వహించామని.. ఈ క్యాంపుల ద్వారా 600 మోటరైజింగ్ త్రీవీలర్స్, హియరింగ్ ఇయర్స్, అలాగే వారికి అవసరమైన దాదాపు 9వేల పరికరాలు రాబోయే రెండు నెలల్లో పంపిణీ చేస్తామన్నారు.

ఎంపీని కలిసిన నాపరాయి పరిశ్రమ యజమానులు

పులివెందులలో వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితోపాటు ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రయ యజమానులు కలిశారు. ఈ సందర్భంగా వారు వారి పరిశ్రమలకు సంబంధించిన ప్రైవేట్ సంస్థ పన్ను సమస్యను ఎంపీకి వివరించారు. దీనికి ఎంపీ వెంటనే మైనింగ్ రాయల్టీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి..

వైఎస్సార్ జిల్లాలోని శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.రాణి ఆధ్వర్యంలో సిబ్బంది ఎంపీకి వినతిపత్రం అందించారు. శిశు సంక్షేమ శాఖలో ఎంతో కాలంగా ప్రమోషన్లు రాకుండా ఉన్నాయన్నారు. దీనికి ఎంపీ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఫక్రుబీ, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పనాథరెడ్డి, ఓబుళరెడ్డి, బలరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రజాక్, రసూల్, ఫకృద్దీన్, సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నుల పండువలా సీతారాముల కల్యాణం


దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో బుధవారం సీతారామ, లక్ష్మణసమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర కలశ స్థాపన గావించారు. అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండువలా నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయనతోపాటు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దంతలూరు కృష్ణ, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి నిర్వహించిన పాటల కచేరి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయులు బాబాహుస్సేన్, గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్ణ రమేష్‌కుమార్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు


పులివెందుల గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని

పులివెందుల టౌన్ : పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు లైబ్రేరియన్ కృష్ణకిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు 36 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథాలయాధికారిణి వెంకటేశ్వరమ్మ తెలిపారు. వల్లూరులోని గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు నీతి కథలను వినిపించారు. అనంతరం విద్యార్థులకు చెస్, క్యారమ్స్ ఆటలను నేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జాన్సన్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని మండల జిల్లా గ్రంథాలయ అధికారి ఇబ్రహీం తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన సీకేదిన్నె గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన వినోదం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు


సంక్షేమపథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మైలవరం మండలంలోని ధన్నవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గతంలో పొన్నంపల్లె గ్రామంలో రోడ్డు, కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో కాల్వలు, రోడ్డు వేస్తున్నామన్నారు. అలాగే రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులతో గ్రామంలో మరిన్ని రోడ్లు, తాగు నీటి పైప్‌లైన్లు వేయనున్నామని ఆయన తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు గ్రామాల్లో తిరిగి అర్హులైన వారందరినీ గుర్తించి వారికి పథకాలు అందించాలన్నారు. గత తెలుగుదేశం హయాంలో పథకాలు కేవలం వారి కార్యకర్తలకే మంజూరు చేసేవారన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేసిన వారిని గుర్తించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ నిరంజన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, రామాంజనేయ యాదవ్, నాగేంద్ర, వీరాంజనేయులు, జయపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు సాంకేతిక విలువలతో కూడిన విద్య


మాట్లాడుతున్న దాల్మియా హెడ్ ముఖేష్ సిన్హా

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : దాల్మియా సిమెంట్ కర్మాగారంలో విద్యార్థులకు సాంకేతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని దాల్మియా యూనిట్ హెడ్ ముకేష్ సిన్హా, సతీమణి రోసెట్టా విలియం తెలిపారు. బుధవారం చిన్నకొమెర్ల గ్రామంలో వారు పాఠశాలను ప్రారంభించి మాట్లాడారు. దాల్మియా అధినేత పునీత్ దాల్మియా, గౌతం దాల్మియా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభిస్తున్నామన్నారు. దాల్మియా కర్మాగారం చుట్టు పక్కల ప్రాంతాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందిస్తామన్నారు. తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

కస్తూర్బా విద్యార్థినికి ప్రతిభా అవార్డు


పవిత్రకు మెమెంటో అందజేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

చక్రాయపేట : కస్తూర్బా గాంధీ బాలికల గురుకులాల్లో 10వ తరగతిలో 555 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన చక్రాయపేట విద్యార్థిని పవిత్రకు జిల్లా విద్యాశాఖ అధికారులు మెమెంటోతో పాటు ప్రశంశా పత్రాన్ని అందజేశారని ప్రిన్సిపాల్ పర్వీన్ తెలిపారు. బుధవారం కడప సభాభవణంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, సర్వశిక్ష అభియాన్ పీవో ప్రభాకరరెడ్డి, జీసీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా పవిత్రకు మెమెంటో అందజేశారని తెలిపారు.10 వతరగతి ఫలితాల్లోనూ వంద శాతం ఉత్తీర్ణత సాదించడంతో ప్రిన్సిపాల్‌ను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత


నియామక పత్రాన్ని, అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ

చెన్నూరు : మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులను కలెక్టర్ ఆదేశాల మేరకు భర్తీ చేసినట్లు ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, కొండపేట సర్పంచ్ తుంగ చంద్రశేఖర్‌యాదవ్‌లతో కలిసి వలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు, మండలంలోని రామనపల్లిలో బీసీ మహిళకు, చెన్నూరు సచివాలయం-1 పరిధిలో ఎస్టీ మహిళకు, కొండపేట ఓసీ మహిళకు సంబంధించి నియామక పత్రాలను అందజేశారు. ఎవరైనా అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు వారికి చేరే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని వారు తెలియజేశారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


పాడదుర్తిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని లేటపల్లె సచివాయల పరిధిలోని పాడదుర్తి, వెంకటాపురం, వై.కొత్తపల్లె, ఎర్రబల్లె గ్రామాల్లో మాజీ సర్పంచ్ శ్రీరాం రమణ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, జరిగిన లబ్ధిని వివరించారు. పాడదుర్తిలో స్మశానానికి ప్రహారి, ఇతర గ్రామాల్లో రోడ్లు, ఇండ్లు, ఇంటి స్థలాలు, భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు కావాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పార్టీలు, వర్గాలు, కులాలు, మతాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన జగనన్నకు ప్రజల తరపున తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఓబుల్‌రెడ్డి, రెడ్డయ్య, రాఘవరెడ్డి, శ్రీనువాసులురెడ్డి, ఉత్తమారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, నిఖిల్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, అయ్యవారయ్య, చెన్నారెడ్డి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని 18వ డివిజన్ సచివాలయ పరిధిలోని మూలవంక గ్రామంలో గురువారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారిని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

చెన్నూరు : మండలంలోని దౌలతాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 60 దేవాలయాలను మంజూరు చేశామన్నారు. గ్రామంలో రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా గ్రామస్తులందరూ కలసికట్టుగా ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య, కరెంటు సమస్య, రోడ్ల సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ రఘురాంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పీసీ కేశవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గురు మహేష్ రెడ్డి, కరుణాకర్, వెంకటనారాయణరెడ్డి, నిరంజన్, భాస్కర్ అఖిల్, రాఘవరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు : శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్, పోటీల నిర్వాహకుడు జి.ఈశ్వరరెడ్డిలు తెలిపారు. స్థానిక ముద్దనూరు రహదారిలో ఉన్న పతంగే రామన్నరావు ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో సీనియర్ ఎద్దుల బండ లాగుడుపోటీలను గురువారం నుంచి ప్రారంభిస్తారన్నారు. మొదటి బహుమతి రూ.80 వేలు, రెండో బహుమతి రూ.50 వేలు, ఆరుపళ్ళు ఎద్దుల పోటీలలో పాల్గొన్న ఎద్దులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఎర్రగుంట్ల : ఈనెల 25, 26, 27వ తేదీలలో కడపలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రాయలసీమస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ 2 తరగతులు నిర్వహిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, మండల కార్యదర్శి లీలాకృష్ణలు బుధవారం ఓ ప్రకనటలో తెలిపారు.

జనుము, జీలగ విత్తనాలు మంజూరు

లింగాల : మండలానికి జనుము, జీలగ విత్తనాలు మంజూరయ్యాయని ఏఓ రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 15 క్వింటాళ్ల జీలుగలు, 5 క్వింటాళ్ల జనుములు మంజూరయ్యాయని.. వీటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తామన్నారు. పచ్చిరొట్టు ఎరువుల కింద ఈ పంటను సాగు చేసుకునేందుకు రైతులకు అందిస్తున్నామన్నారు. కావాల్సిన రైతులు ఆయా సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రైతు సేవే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : ఆర్‌బీకేలు రైతు సేవే లక్ష్యంగా పనిచేయాలని ఉద్యాన శాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కమలాపురం నాల్గవ ఆర్‌బీకేలో డీఆర్‌సీ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ఆర్‌బీకే సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా ఆర్‌బీకే సిబ్బంది పనిచేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఎరువులు, మందులు, విత్తనాలు అందిచాలన్నారు. మట్టి నమూనాలు సేకరించి ఫలితాలను రైతులకు అందజేసి వారికి వినియోగించాల్సిన ఎరువుల గురించి తెలియజేయాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న రైతులకు పీఎం కిసాన్ ఈకేవైసీ తప్పని సరిగా చేయించాలన్నారు. డీఆర్‌సీ డీడీఏ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆర్‌బీకే పరిధిలో సేంద్రీయ వ్యవసాయం చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త శిల్పకళా మాట్లాడుతూ వేసవిలో లోతు దుక్కులు దున్నితే కలిగే ప్రయోజనం గురించి వివరించారు. డీఆర్‌సీ ఏఓ పద్మజ పొలంబడి ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, సాయిజ్యోతి పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీలక్ష్మీ మహాయజ్ఞం


శ్రీలక్ష్మీ మహాయజ్ఞం ఆహ్వాన పత్రికలను ప్రదర్శిస్తున్న ఏసీ శంకరబాలాజి

పులివెందుల టౌన్ : విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ, ధర్మదాయ శాఖ నిర్వహణలో ఈనెల 12వ తేదీనుంచి 17వ తేదీవరకు శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర బాలాజి తెలిపారు.

బుధవారం పట్టణంలోని స్థానిక మిట్టమల్లేశ్వర స్వామి కళ్యాణ మండపంలోని దేవదాయ శాఖ కార్యాలయంలో ఆయన శ్రీలక్ష్మీ మహాయజ్ఞం ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సుభిక్షం కోసం, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వహస్తములతో అష్టోత్తర శతకుండాత్మక (108), చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శనసహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమాలు ఎంతో వైభవం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీఈ గంగన్న, ఈఓ రమణ పాల్గొన్నారు.

బలవంతంగా టీడీపీ జెండాలు కట్టించారు

కమలాపురం : దేవరాజుపల్లె సచివాలయ పరిధిలోని జీవంపేట, చిన్నపుత్త సముద్రంపల్లె గ్రామాలలో టీడీపీ జెండాలను పుత్తా నరసింహారెడ్డి బలవంతంగా కట్టించారని డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం అక్కడి గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకు నిరసన సెగ అని కొన్ని పత్రికల్లో, ఛానళ్లలో రావడం దుర దృష్టకరం అన్నారు. మా ఎమ్మెల్యే ఆదేశిస్తే మేము కూడా టీడీపీ తిరిగే గ్రామాల్లో జెండాలు కట్టిస్తామని, తాళాలు వేస్తామన్నారు. అక్కడ ఓటింగ్ జరిగితే 80 శాతం ఓట్లు వైఎస్సార్ సీపీకే వస్తాయన్నారు. పత్రికలు వాస్తవాలు రాయాలన్నారు.

కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్‌సాదిక్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.